ప్రజాశక్తి
సోమవారం 21 అక్టోబర్ 2024
5
శ్రీ సత్యసాయి





కనువిందు చేస్తున్న బట్రేపల్లి జలపాతం

వేళ్లూనిన మెడికల్ మాఫియా



ఉమ్మడి జిల్లాలో మెడికల్ మాఫీయా వేళ్లూనింది. మందుల దుకాణాలను ఇష్టారాజ్యంగా నిర్వహిస్తున్నారు. దుకాణం నిర్వహించే వ్యక్తి ఫార్మసిస్ట్ అయి ఉండాలన్న నిబంధన ఎక్కడా అమలు కావడం లేదు. ఏమాత్రం అవగాహన లేని వారు మందులను విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. సంబంధిత అధికారులు తనిఖీలకు స్వస్తి చెప్పి చర్యలకు ముఖం చాటేశారన్న ఆరోపణలు వినపడుతున్నాయి. దీంతో మందుల దుకాణదారులు ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు. వైద్యులు ధ్రువీకరించిన మందుల చీటీ ఉంటేనే మందులు ఇవ్వాల్సి ఉండాలన్న నిబంధన కూడా ఎక్కడా అమలు కావడం లేదు.

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి జిల్లాలో 2 వేలకు పైగా మెడికల్ షాపులు
ఇష్టారాజ్యంగా నిర్వహణ
ఫార్మాసిస్టులు లేని దుకాణాలే ఎక్కువ
విచ్చలవిడిగా యాంటీ బయాటిక్స్, పెయిన్ కిల్లర్ మందుల విక్రయం

జిల్లాలో మెడికల్ షాపులు ప్రొవిజన్ స్టోర్స్ మాదిరిగా విచ్చలవిడిగా ఏర్పాటవుతున్నాయి. కొద్ది రోజుల పాటు మెడికల్ షాపుల్లో పని చేసిన వారంతా సొంతంగా దుకాణాలు తెరుస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే దాదాపు 70 శాతం వరకు పార్మసిస్టు లేని దుకాణాలే ఉన్నాయని తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 2030 వరకు మెడికల్ షాపులున్నాయి. ఇందులో హోల్ సేల్ 365 వరకు కాగా, రిటైల్ దుకాణాలు 1,665 వరకు ఉన్నాయి. ఒక్క హిందూపురం పట్టణంలోనే దాదాపు 110 వరకు మెడికల్ షాపులు ఉన్నాయి. మారు మూల ప్రాంతం అయిన అమరాపురంలో 4 షాపులు ఉన్నాయి. ఇవి కాక గ్రామాల్లో సైతం మెడికల్ షాపులు ఉన్నాయి. వీటితో పాటు ఎక్కడైనా ఆస్పత్రి కొత్తగా ఏర్పాటు చేస్తున్నారంటే దానికి అనుసంధానంగా మందుల దుకాణం పెట్టడానికి పోటీ విపరీతంగా ఉంటుంది. జిల్లాలో కొన్ని మల్టీస్పెషాలిటీ ఆస్పతుల్లో మందుల దుకాణం ఏర్పాటుకు పోటీ దారులు లక్షల రూపాయలు గుడ్ విల్‌గా ఇచ్చేందుకు వెనకాడటం లేదని సమాచారం. మందుల దుకాణంలో వచ్చే ఆదాయం ఎక్కువగా ఉంటుండడంతో ఆ ఆస్పత్రుల వర్గాలే సొంతంగా మెడికల్ షాపులను ఏర్పాటు చేసుకుంటున్నాయి.

నామమాత్రపు తనిఖీలు

జిల్లాలో మందుల దుకాణాల నిర్వహణపై ఔషధ నియంత్రణ శాఖ సహాయక సంచాలకుడి పర్యవేక్షణతో పాటు డ్రగ్ ఇన్ స్పెక్టర్ల పర్యవేక్షణ కూడా ఉంటుంది. అయితే వీరు నామమాత్రపు తనిఖీలు నిర్వహిస్తూ చేతులు దులుపుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాదిలో దాదాపు 270 వరకు కేసులు నమోదు అయినట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో అనంతపురం నగరంలోనే ఎక్కువగా నమోదు అయినట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలో హిందూపురం అతిపెద్ద పట్టణం. ఇక్కడ రెగ్యూలర్‌గా డ్రగ్ ఇన్స్‌పెక్టర్ లేక పోవడం ఔషధ నియంత్రణ శాఖ పనితీరుకు అద్దం పడుతోంది. సంబంధిత శాఖాధికారులు పూర్తిస్థాయిలో చిత్తశుద్ధితో విధులు నిర్వర్తిస్తే వందల కొద్ది కేసులు నమోదయ్యే అవకాశం ఉంది. జిల్లా అధికారుల సరైన చర్యలు లేకపోవడంతో మందుల దుకాణదారులు ఇష్టారాజ్యంగా వ్యవహిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. మందుల దుకాణాలకు లైసెన్సులున్నాయా...? సంబందిత సర్టిఫికెట్ ఉన్న పార్మసిస్ట్ దుకాణం నిర్వహిస్తున్నారా...? మందుల ఇచ్చే అనుభవం ఉందా...? తదితర విషయాలపై పూర్తి స్థాయిలో విధిగా తనిఖీలు నిర్వహించాల్సిన ఆవసరం ఉంది. ఇప్పటికైనా అధికారులు దుకాణాలపై దృష్టి సారించి జరుగుతున్న పొరపాట్లును గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. అర్హత, అనుభవం లేని వ్యక్తులు నిర్వహించే మందుల దుకాణాల వల్ల ప్రజల ప్రాణాలకు ముప్పు పొంచి ఉంది.

నిబంధనల అమలెక్కడ....?

మందుల దుకాణాల్లో ఫార్మసిస్టు మాత్రమే మందులు ఇవ్వాల్సి ఉంటుంది. దుకాణం నిర్వహిస్తున్న సమయాల్లో ఆయన పర్యవేక్షణలోనే మందుల విక్రయాలు జరగాలి. కానీ సింహ భాగం రిటైల్ దుకాణాల్లో ఫార్మసిస్టు లేరు. పట్టణాల్లోనే ఈ పరిస్థితి కొనసాగుతుంటే ఇక గ్రామాల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. కొన్నిచోట్ల ఎలాంటి ఫార్మసిస్ట్ పత్రం లేకుండానే మందులు విక్రయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇతరుల సర్టిఫికెట్లను అద్దెకు తెచ్చుకుని దుకాణాలను నడుపుతున్నట్లు తెలుస్తోంది. ఎంబిబిఎస్ వైద్యులు సిఫార్సు చేసిన మందుల చీటి ఆధారంగానే జలుబు, జ్వరం వంటి చిన్న చిన్న రోగాలకు సైతం మందుల ఇవ్వాని ఉంటుంది. అయితే ప్రిస్కిప్షన్ లేకుండానే చిన్న పిల్లలు వెళ్లి అడిగినా మందు బిళ్లలు ఇచ్చేస్తున్నారు. ఇక దుకాణాల్లో అమ్మే మందుకు కొనుగోలుదారులకు ఎలాంటి బిల్లులు ఇవ్వడం లేదు. తెచ్చే మందులకు, విక్రయించే మందులకు ఎలాంటి రిజిస్టర్లు అమలు చేయడం లేదు. ఎవరైనా రీయింబర్స్‌మెంట్ కోసం కొనుగోలు చేసేందుకు బిల్లులు అడిగితే ఎమ్మార్పీ ధరలు, దానిపై జీఎస్టీ వేసి ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. పలు దుకాణాలకు జీఎస్టీ కూడా లేకపోవడం విశేషం.



పట్టణంలోని డ్రగ్ ఇన్స్‌పెక్టర్ కార్యాలయం

అర్హతలేని వారిని నియమిస్తే చర్యలు

జిల్లాలోని ప్రతి మెడికల్ షాపులో అర్హత ఉన్న ఫార్మాసిస్టును మాత్రమే నియమించుకోవాలి. అర్హత లేని వారిని నియమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. అలా నియమించారో.. లేదో తెలుసుకోవడానికి పని చేస్తున్న సిబ్బంది పాన్ కార్డు, బ్యాంకు ఖాతాల వివరాలు అడిగి తెచ్చుకున్నాం. వేతనాలు కూడా వారి ఖాతాల్లోనే పడాలి. డాక్టర్లు రాసిన ప్రిస్కిప్షన్‌కు మాత్రమే మందులు ఇవ్వాలి. ప్రజలు కూడా ఇష్టారాజ్యంగా మందులు కొనుగోలు చేసి వాడుకోరాదు. అలా వాడుకుంటే దీర్ఘకాలంలో అనారోగ్య సమస్యలు వస్తాయి. మెడికల్ షాపు వారు అమ్మిన ప్రతి మందుకు బిల్లు ఇవ్వాలి. ప్రజలు కూడా అడిగి తీసుకోవాలి. బిల్లులు ఇవ్వకుండా మందులను విక్రయిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటాం.

రమేష్ రెడ్డి,
ఏడీ, జిల్లా ఔషధనియంత్రణ శాఖ

కనువిందు చేస్తున్న బట్రేపల్లి జలపాతం

జలపాతం వద్ద ప్రకృతి ప్రియుల సందడే సందడి

ప్రజాశక్తి - కదిరి టౌన్, తలుపుల

కిలోమీటర్ల మేర చుట్టూ పచ్చని మైదానం, కోకిళ్ల కిలకిల రావాలతో పాటు కలకల నెమలి నాట్యంతో చేస్తున్న దృశ్యం ఎక్కడ కాదండోయ్.. శ్రీ సత్యసాయి జిల్లా తలుపుల మండలం కదిరి, పులివెందుల ప్రధాన రహదారి పక్కనే ఉన్న బట్రేపల్లి జలపాతం. ఇటీవల కురిసిన వర్షాలకు కొండపై నుండి జాలువారుతున్న జలాలతో బట్రే పల్లి జలపాతం పర్యాటకుల్ని కనువిందు చేస్తోంది. వంద అడుగులు ఎత్తు నుంచి దుముకుతున్న నీరు పాలవలే తెల్లగా జాలువారుతున్న దృశ్యాన్ని ప్రకృతి ప్రియులు చూసి తన్మయం చెందుతున్నారు. చుట్టూ కిలోమీటర్ల మేర పచ్చని మైదానం కప్పుకుని ఉన్న దృశ్యాలను వీక్షించేందుకు కుటుంబ సభ్యులుతో ఆదివారం పర్యాటకులతో ఈ ప్రాంతం జనసంచారం సంచరించుకుంది. అహ్లాద వాతావరణంలో సకుటుంబ సమేతంగా ఇక్కడికి వచ్చి ఆనందంగా ప్రకృతిని ఆస్వాదిస్తూ తన్మయం చెందుతున్నడం విశేషం. ఆదివారం కావడంతో చుట్టుపక్కల ఉన్న ప్రజల ఇక్కడకొచ్చి తమ ఫోన్లలో జలపాత దృశ్యాలను, పచ్చని మైదానాన్ని బంధించుకుంటూ ముందుకు సాగుతున్నారు. జలపాతం వద్ద వేడివేడి బజ్జీలు, జొన్న రొట్టెలు, సజ్జ రొట్టెల దుకాణాలు ఏర్పడి వ్యాపార కార్యకలాపాలు కొనసాగించడం విశేషం. ఈప్రాంతాన్ని స్థానిక పోలీస్ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు.



బట్రేపల్లి వద్ద పర్యాటకుల సందడి

ప్రశాంతంగా ముగిసిన పరీక్షలు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ఎంజీఎం పాఠశాలలో తపాలా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన దీన్ దయాల్ స్పర్శ యోజన పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా తపాలా శాఖ సూపరింటెండెంట్ విజయ్ కుమార్ మాట్లాడుతూ ఆరవ తరగతి నుంచి తొమ్మిదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించాలని తపాలా శాఖ ఆధ్వర్యంలో దీన్ దయాల్ స్పర్శ యోజన పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. మొదటి రౌండ్ లో ఎంపికైన వారిని రెండవ రౌండ్ కు ఎంపిక చేసి, అందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సంవత్సరానికి రూ. 6వేల ఉపకార వేతనం అందించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కావడం వల్ల రాబోయే కాలంలో అన్ని పోటీ పరీక్షలకు ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ మల్లికార్జున, స్థానిక పోస్ట్ మాస్టర్ మార్కండేయులు, తపాలా శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

రైలులో మహిళ మృతి

ప్రజాశక్తి - గుత్తి

కన్యాకుమారి ఎక్స్ ప్రెస్ రైలులో ప్రయాణిస్తున్న గుర్తు తెలియని ఓ మహిళ(55) ఆదివారం గుత్తిలో మృతి చెందింది. గుత్తి జీఆర్పీ ఎస్ఐ నాగప్ప తెలిపిన వివరాల మేరకు పూణె నుంచి కన్యాకుమారి వైపునకు వెళ్తున్న ఎక్స్ ప్రెస్ (16381) రైలు గుత్తికి చేరుకుంది. అయితే రైలులో ప్రయాణిస్తున్న గుర్తు తెలియని మహిళ ముక్కులో నుంచి రక్తం వస్తుండటంతో గమనించిన తోటి ప్రయాణికులు వెంటనే గుత్తి రైల్వే స్టేషన్ లోని జీఆర్పీ పోలీసులు, స్టేషన్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ప్రయాణికుల సమాచారంతో రైల్వే అధికారులు వెంటనే గుత్తి రైల్వే ఆసుపత్రి వైద్యులను స్టేషన్‌కు పిలిపించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్టు ధ్రువీకరించారు. మృతి చెందిన మహిళ ఆచూకీ తెలిస్తే 6305073235 నెంబర్ ను సంప్రదించాలని జీఆర్పీ ఎస్ఐ తెలిపారు. గుర్తు తెలియని మహిళ గుండె పోటుతో మృతి చెంది ఉంటుందని వైద్యులు అనుమానం వ్యక్తం చేశారు. ఈ మేరకు రైల్వే జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసుకొని మహిళ ఆచూకీ కోసం ఆమె ఫోటోను అన్ని పోలీసు స్టేషన్లకు పంపారు.



రైలులో మృతిచెందిన మహిళ

పిడుగుపాటుకు రైతు మృతి

'పురం'లో భారీ వర్షం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణ సమీపంలోని పోచనపల్లి వద్ద ఆదివారం కురిసిన వర్షాలకు పిడుగు పడి రైతు లక్ష్మయ్య (65) మృతి చెందాడు. అతనితో పాటు ఆవు మృతిచెందింది. రైతు లక్ష్మయ్య తన పాడి అవును మేత కోసం గ్రామ సమీప పొలాల్లోకి తీసుకెళ్లాడు. ఈసందర్భంగా ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురుస్తుండడంతో వేప చెట్టు కిందకు ఆవును తీసుకొని వెళ్లాడు. ఈ సమయంలో పిడుగు పడింది, ఆ శబ్దానికి రైతు లక్ష్మయ్య అతనితో పాటు అతని పాడి ఆవు కూడా మృతిచెందింది.

భారీ వర్షం : పట్టణంతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో ఆదివారం ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో చెరువులకు భారీగా నీరు చేరాయి. బసవనపల్లి చెరువుకు భారీగా నీరు చేరి, ఆదివారం రాత్రి మరువ పారింది. దీంతో బెంగళూరు రోడ్డులో ట్రాపిక్ జామ్ అయింది. తూమకుంట వైపు వెళ్లే వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



మృతిచెందిన రైతు లక్ష్మయ్య

'ప్రజాదర్బార్' సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్

పజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

'ప్రజాదర్బార్"లో ప్రజల నుంచి స్వీకరించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఆదివారం అనంతపురం నగరంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో 'ప్రజాదర్బార్' కార్యక్రమాన్ని మంత్రి నిర్వహించి ప్రజల నుంచి పలు సమస్యలను తెలుసుకున్నారు. ఇందులో భాగంగా మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మడకశిర నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని మంత్రిని కోరారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని ప్రభుత్వం ప్రజాసమస్యల పరిష్కారంలపై ప్రత్యేక దృష్టిసారించిందన్నారు. ఈసందర్భంగా మంత్రి దృష్టికి పలువురు ప్రజలు, నాయకులు తమ సమస్యలను తీసుకువచ్చారు. వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



తమ సమస్యలు మంత్రికి విన్నవిస్తున్న ప్రజలు

నిబంధనలు పాటించని పాఠశాలలకు షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి- హిందూపురం


ప్రభుత్వ నిబంధనలకు విరుద్దంగా ఆదివారం సెలవు రోజున తరగతులు నిర్వహిస్తున్న చైతన్య, నారాయణ పాఠశాలలకు అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. సెలవురోజున తరగతులు నిర్వహిస్తున్న విషయం తెలుసుకున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి ఫోన్ ద్వారా స్థానిక మండల విద్యాశాఖ అధికారి గంగప్ప దృష్టికి తీసుకెళ్లారు. చైతన్య, నారాయణ పాఠశాలలపై శాఖ పరమైన చర్యలను తీసుకోక పోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని హెచ్చరించారు. స్పందించిన ఎంఇఒ గంగప్ప వెంటనే చైతన్య, నారాయణ పాఠశాలలను తనఖీ చేశారు. తరగతులు నిర్వహిస్తుండడంతో నిర్వాహకులపై ఆగ్రహాన్ని వ్యక్తం చేసి, విద్యార్థులను ఇంటికి పంపించారు. షోకాజ్ నోటీస్ ఇస్తున్నామని, తగిన సమాధానం ఇవ్వక పోతే శాఖ పరమైన చర్యలను తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు తరుణ్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను ఇంటికి పంపుతున్న ఎంఇఒ

పశుసంపద పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

పశుసంవర్థక శాఖ జిల్లా అధికారి డాక్టర్ శుభదాస్



ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లా వ్యాప్తంగా పశుపోషణ, వాటి పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు శ్రీ సత్య సాయి జిల్లా పశుసంవర్థక శాఖ జిల్లా అధికారి డాక్టర్ శుభదాస్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పశుసంపద పరిరక్షణ గురించి పలు విషయాలను వెల్లడించారు.

ప్ర : సత్యసాయి జిల్లాలో ఎన్ని పశు వైద్యశాలలు ఉన్నాయి ?

జవాబు: శ్రీ సత్యసాయి జిల్లాలో మూడు డివిజన్లలో 15 ఏరియా వెటర్నరీ ఆసుపత్రులు, 72 పశు వైద్య కేంద్రాలు ఉన్నాయి. వీటితో పాటు గ్రామాలలోకి వెళ్లి పశువులకు వైద్య సేవలు అందిస్తున్నారు. నడవలేని, లేవలేని ఆవులు, గేదెలు, ఎద్దుల కొరకు ఆయా మండలాల్లో అందుబాటులో అంబులెన్స్ సౌకర్యం కల్పించాం. పశువులను వైద్యశాలలకు తరలించేందుకు వీటిని వినియోగిస్తున్నాం.

ప్ర : పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో పశుసంపదను పరిరక్షించే చర్యలు ఏవి?

జ: పశు వైద్యశాలల పరిధిలో గొర్రెలకు, మేకలకు అంటువ్యాధులు వ్యాపించకుండా సంరక్షించుకోవడానికి తరచూ టీకాలు వేయించాలి. గేదెలకు, ఆవులకు, ఎద్దులకు గొంతు వాపు , సోప్ప వాపు వ్యాధి తరచూ వస్తూ ఉంటాయి. వీటి నుంచి పశువులను సంరక్షించుకోవడానికి గ్రామాల్లో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి టీకాలు వేయడం, మందులు ఉచితంగా పంపిణీ చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. వర్షాకాలంలో పశువులకు వ్యాపించే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. గొర్రెలు, మేకలకు నట్టల వ్యాధి సోకకుండా తరచూ మందులు వాడాలి. ఈ వ్యాధి నివారణ కొరకు అక్టోబర్ 16వ తేదీ నుండి జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

ప్ర : పశుసంవర్థక శాఖ పరంగా జిల్లాలో రైతులకు ఏయే ప్రోత్సాహకాలు అందుతున్నాయి ?

జ: జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో సమీకృత దాణా 50 శాతం సబ్సిడీతో పశుసంపద కలిగిన రైతులకు అందజేస్తున్నాం. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా పశు వైద్యశాలలో డాక్టర్ల వద్ద నమోదు చేసుకున్న రైతులకు ఈ దాణా పంపిణీ చేసాం. జిల్లావ్యాప్తంగా 150 టన్నుల దాణా సబ్సిడీ ధరలకు అందించాం. అంతేకాక రైతుల అవసరాల మేరకు వారికి కావలసినంత స్టాకును తెప్పించి రైతులకు అందజేయనున్నాం.

ప్ర : పశువుల పెంపకం దారులకు ప్రభుత్వం నుండి అందుతున్న ప్రోత్సహకాలు ఏవీ?

జ: పశు సంపద కలిగిన రైతులను ప్రోత్సహించడానికి శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం 1325 గోకులం షెడ్లను మంజూరు చేసింది. రెండు, నాలుగు, ఆరు ఆవుల కొరకు షెడ్లను మంజూరు చేసి, రైతు వాటా కింద 10 శాతం చెల్లింపుతో షెడ్లను నిర్మించి రైతులకు అందిస్తున్నాం. రెండు ఆవుల షెడ్లకు రైతు 10 శాతం అనగా రూ.11,500 చెల్లిస్తే రూ. 1. 35 లక్షలు ప్రభుత్వం రాయితీ ఇస్తుంది.

ప్ర : జిల్లాలో పశు వైద్య శాలల్లో సిబ్బంది కొరత ఉందా?

జ: శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా 72 మంది పశు వైద్యాధికారులు ఉండాలి. కానీ ప్రస్తుతం 40 మంది వైద్యులు మాత్రమే అందుబాటులో ఉన్నారు. 32 పశు వైద్యుల కొరత ఉంది. పశు వైద్య సహాయకులు పదిమంది ఉండాలి. కానీ ప్రస్తుతం ఏడుగురు ఉన్నారు. జిల్లాలో ఏడీలు 15 మంది ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా శిథిలావస్థకు చేరుకున్న పశు వైద్యశాలల భవనాల స్థానంలో నూతన భవనాలు నిర్మించడానికి ప్రభుత్వ అనుమతులకు పంపాం. అవి మంజూరు అయితే కొత్తచెరువు, కల్లూరు, సికె పల్లి, ఎన్పీకుంట, తలుపుల మండలాల్లో నూతన భవనాలు నిర్మించనున్నాం.



డాక్టర్ శుభదాస్

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి

ప్రజాశక్తి-పెనుకొండ

పల్లెలే దేశానికి పట్టు కొమ్మలని, గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర బిసి సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత తెలిపారు. మండలంలోని రాంపురం పంచాయతీకి చెందిన మరువపల్లి గ్రామంలో ఆదివారం మంత్రి రూ. 86 లక్షల నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. మంత్రి మాట్లాడుతూ పల్లెలకు పూర్వ వైభవం తెచ్చేందుకే కూటమి ప్రభుత్వం 'పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాలు' పేరుతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. మొదటి దశ పనులను త్వరగా పూర్తి చేస్తే త్వరలోనే రెండో దశ నిధులను కేటాయిస్తామన్నారు. గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపేందుకు సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ విశేష కృషి చేస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి దేశంలోనే ఆదర్శంగా తీర్చేదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారని తెలిపారు. సంక్రాంతికి ఉచిత గ్యాస్ సిలిండర్లు, జనవరిలో తల్లికి వందనం, మార్చిలో అన్నదాత సుఖీభవ, తదితర సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్నారు. గత ప్రభుత్వం తప్పిదాల వల్ల రాష్ట్రం అభివృద్ధిలో పూర్తిగా వెనుకబడిందని ఆందోళన వ్యక్తం చేశారు. జగన్ పాలనలో గ్రామ పంచాయతీల్లో సర్పంచులకు అధికారం లేకుండా చేశారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సర్పంచులకు పూర్తి అధికారమిచ్చి గౌరవం ఇచ్చిందన్నారు. కేంద్రం ఉపాధి హామీ ద్వారా రాష్ట్రానికి భారీగా నిధులు కేటాయించి జీవం పోసిందన్నారు. అనంతరం శెట్టిపల్లి పంచాయతీలోని బాపనకాలువ గ్రామంలో రూ. 30 లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డును మంత్రి ప్రారభించారు. కార్యక్రమంలో మండల అధికారులు, టిడిపి, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సవిత

నష్టాల ఊబిలో కౌలు రైతులు..!

ఆదుకోవాలని ప్రభుత్వానికి వేడుకోలు

ప్రజాశక్తి-అగళి

మండలంలో వ్యవసాయాన్ని నమ్ముకున్న కౌలు రైతులు ఏటా నష్టాలు చవి చూస్తూనే ఉన్నారు. మండలంలో 60 శాతం మంది ప్రజలు వ్యవసాయం మీద ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అందులో 30శాతం మంది రైతులు వ్యవసాయం భారమై ఉపాధి కోసం బెంగళూరుకు వలస వెళ్లారు. కొందరు గ్రామంలోనే ఉన్నా వారు వ్యవసాయం చేయలేక వ్యవసాయ రంగంపై అవగాహన ఉన్న వారికి కౌలుకు ఇస్తారు. ఇలా దాదాపు అన్ని గ్రామాల్లో కౌలు రైతులు వేరుశనగ, పత్తి, రాగి, మిరప, తదితర పంటలు సాగు చేస్తారు. అయితే వర్షాభావం, అతివృష్టి, అనావృష్టి, తదితర కారణాలతో కౌలు రైతులు ఏటా నష్టపోతూనే ఉన్నారు. ఒకవేళ పంట దిగుబడి బాగా వచ్చినా సరైన మార్కెట్ సౌకర్యం లేక దళారుల చేతుల్లో నలిగిపోతున్నారు. ఈ ఏడాది వారం రోజులుగా ఎడతెరిపి లేని వర్షాలు కురవడంతో పత్తి పంట పూర్తిగా నీటిలో మునిగింది. పొలాల్లో వర్షం నీరు నిలిచి మిరప మొక్కలు పూర్తిగా కుళ్లిపోయాయి. వేరుశనగ పంటను కోత కోయకుండా పొలాల్లోనే వదిలేయడంతో కాయలు మొలకెత్తగా, గడ్డి పశువులకు మేతకు కూడా ఉపయోగపడకుండా కుళ్లిపోయింది. ఇలా కౌలు రైతులు పూర్తిగా నష్టపోయారు.

బ్యాడిగెర గ్రామంలో రైతు గోవిందప్ప మూడెకరాల్లో వేరుశనగ, పత్తి పంటలు సాగు చేశారు. పత్తి పంట పూర్తిగా దెబ్బతినగా వేరుశనగ పంట 50శాతం చేతికి వచ్చింది. రైతు శివరాజ్ రెండెకరాల్లో కనకాంబరం పూలు సాగు చేయగా ఎడతెరిపి లేని వర్షాలతో మొక్కలు పూర్తిగా కుళ్లిపోయాయి. వీటిని వ్యవసాయ అధికారులు కానీ ఫీల్డ్ సర్వే చేసే వీఆర్ఏలు కానీ ఎంపీఈవోలు కానీ ఏ ఒక్కరూ పరిశీలించలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు సచివాలయంలో కూర్చుని వారి దగ్గర ఉన్న 1-బి, అడంగల్ ముందు పెట్టుకుని వారి దగ్గర ఉన్న రైతుల జాబితాలో మాత్రమే భూముల పూర్తి వివరాలు సేకరించి పంట వివరాలు నమోదు చేస్తున్నారని కౌలు రైతులు వాపోతున్నారు. దీంతో ప్రభుత్వం నుంచి అందే సాయం కూడా పొలం యజమానికే దక్కుతుంది. ఇకనైనా వ్యవసాయ అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో పర్యటించి పొలం యజమాని సాగు చేస్తున్నాడా లేక కౌలు రైతులు సాగు చేస్తున్నారా అని పరిశీలించి పంట నష్టపోయిన కౌలురైతులకు నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కౌలు రైతులు కోరుతున్నారు.

ఆర్టీసీ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జిలానీబాషా, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్.వెంకటేష్

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

ఆర్టీసీ డిపో గ్యారేజీల్లో పని చేసే కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జిలానీబాషా, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేష్ డిమాండ్ చేశారు. వారు ఆదివారం పుట్టపర్తి ఆర్టీసీ గ్యారేజీలో పని చేసే కాంట్రాక్ట్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు అమలు నేపథ్యంలో ఉత్పన్న మవుతున్న సమస్యలపై ఎస్‌డబ్ల్యుఎఫ్ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. ఈకేవైసీ సమస్యలు కొంతమేర పరిష్కారమైనా ఇంకా వేగవంతంగా చేయాలన్నారు. ఎఇఎస్ ఆర్టీసీగా ఉన్న సమయంలో రికవరీ చేసిన డబ్బులను వడ్డీతో సహ కార్మికులకు జమ చేయాలన్నారు. చట్ట ప్రకారం హైయర్ పెన్షన్‌ను చెల్లించాలన్నారు. స్కీం నుంచి ఎగ్జిట్ అవుతున్న వారి ఆధారంగా డిమాండ్ నోటీసులు జారీ చేయాలే తప్ప ర్యాండమ్‌గా పంపరాదన్నారు. యాజమాన్యం వాడుకున్న నిధులను సత్వరమే పిఎఫ్ ట్రస్టుకు జమ చేయాలన్నారు. కేవైసీ కాలేదని బ్యాన్ చేసిన 1400 మంది కేసులను వెంటనే పరిష్కరించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై, యాజమాన్యం ఇచ్చిన హామీలను నిర్దిష్ట కాల పరిమితిలో అమలు చేయని పక్షంలో జీవన ప్రమాణాలను మెరుగుపరుచు కునేందుకు, సామాజిక భద్రత కోసం కార్మికులు పోరాటానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎస్‌డబ్ల్యుఎఫ్ జిల్లా అధ్యక్షులు యాకుబ్‌ఖాన్, గ్యారేజీ ఉద్యోగులు ఎంహెచ్ బాబు, ఈ.మోహన్, బాషా, తదితరులు పాల్గొన్నారు.


ఆర్టీసీ డిపో గ్యారేజీలో కార్మికులతో మాట్లాడుతున్న నాయకులు

నేటి నుంచి పోలీసు అమరవీరుల వారోత్సవాలు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఏటా పోలీస్ అమరవీరులను స్మరించుకుంటూ నిర్వహించే పోలీసు అమరవీరుల వారోత్సవాల ను సోమవారం పట్టణంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రారంభిస్తామని ఎస్పీ వి.రత్న తెలిపారు. అమరులైన పోలీసుల సేవలను స్మరించుకుంటూ వారి సేవలను కొనియాడుతూ ఈ వారోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా పోలీస్ శాఖ సర్వం సిద్ధంచేసిందన్నారు. వారోత్సవాల ఏర్పాట్లను ఎఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, ఎఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్ పోలీస్ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. అలాగే ఆదివారం పోలీస్ సిబ్బంది రిహార్సిల్స్ చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు వలి, చంద్రశేఖర్, రవి, ఎఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రికి ఆహ్వానం

పెనుకొండ : పోలీసుల అమరవీరుల దినోత్సవ వేడుకలకు హాజరవ్వాలని కోరుతూ ఆదివారం పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు రాష్ట్ర బిసి సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవితను ఆహ్వానించారు. అలాగే డిజిపి ద్వారక తిరుమలరావు కుమారుని వివాహ వేడుకకు రావాలని వివాహ ఆహ్వాన పత్రికను డిజిపి తరపున డీఎస్పీ అందజేశారు. డీఎస్పీ వెంట పెనుకొండ ఎస్ఐ వెంకటేశ్వర్లు ఉన్నారు.


మంత్రి సవితకు ఆహ్వాన పత్రిక ఇస్తున్న డీఎస్పీ

నేరాలు ఘోరాలు

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

కదిరి టౌన్ : కదిరి రూరల్ మండలంలోని ముత్యాలచెరువులో ఆదివారం చేపల వేటకు వెళ్లి ప్రమాదశాత్తూ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. కదిరి రూరల్ మండలంలోని ముత్యాలచెరువు గ్రామానికి చెందిన ఆదెప్ప(56) సమీపంలోని చెరువులోకి చేపల వేటకు వెళ్లాడు. ప్రమాదవశాత్తూ చేపల వలలో చిక్కుకుని మృతి చెందాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ స్టేషన్ పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడు..

పెనుకొండ : ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొని తీవ్రంగా గాయపడిన యువకుడు ఆదివారం మృతి చెందినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. వివరాలు.. పట్టణంలోని చెరువుగేరికి చెందిన వి.మనోజ్‌కుమార్(20) కియా అనుబంధ సంస్థలో పని చేసేవాడు. శనివారం విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా మిట్ట ఆంజనేయస్వామి ఆలయం వద్ద సైకిల్‌పై వస్తున్న ఓ వ్యక్తి అడ్డు రావడంతో అదుపుతప్పి బలంగా డివైడర్‌ను ఢీకొన్నారు. దీంతో మనోజ్ కుమార్ తలకు తీవ్ర గాయాలు కాగా అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతడు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.


మనోజ్‌కుమార్(ఫైల్‌ఫొటో)

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ..

తలుపుల : ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి అనంతపురం నగరంలోని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. స్థానిక ఎగువపేటకి చెందిన కంపరాజు శ్రీనివాసులు మద్యానికి బానిసయ్యాడు. ప్రతిరోజూ అతిగా మద్యం తాగి వస్తుండడంతో గత శనివారం భార్య అనసూయ, కొడుకు రవి అతడి ఆరోగ్యం రీత్యా మద్యం తాగవద్దని మందలించారు. దీంత మనస్తాపానికి గురైన శ్రీనివాసులు పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అదుపుతప్పి ఆటో బోల్తా

ముదిగుబ్బ : స్థానిక దొరిగల్లు రోడ్డులో ఆదివారం సాయంత్రం అరటికాయల లోడుతో వెళ్తున్న ఓ ఆటో అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. ఆ సమయంలో అటుగా వెళ్తున్న యువకులు గమనించి ఆటోలో ఉన్న వ్యక్తులను కాపాడారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దొరిగల్లు రోడ్డు బాగా దెబ్బతింది. గుంతలు ఏర్పడి రాళ్లు, కంకర తేలి ఉండడంతో అందులో వర్షం నీరు చేరాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు, పాదచారులు ఈ మార్గంలో ప్రయాణించాలం టే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చొరవ తీసుకొని రోడ్డు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఎట్టకేలకు డంపింగ్‌యార్డ్ తొలగింపు

ప్రజాశక్తి-గోరంట్ల

పట్టణంలోని ఎముకలగుట్టపల్లి వద్ద జగనన్న కాలనీ సమీపంలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్‌ను ఎట్టకేలకు తొలగించారు. డంపింగ్ యార్డ్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తూ ఇటీవల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న ఆధ్వర్యంలో ఎంపిడిఒ నరేంద్రకుమార్‌కు వినతి పత్రం ఇచ్చిన విషయం విదితమే. ఈ విషయంపై స్పందించిన అధికారులు ఆదివారం డంపింగ్ యార్డ్‌లో జెసిబి, గ్రామ పంచాయతీ సిబ్బంది చేత చెత్తను తొలగించారు. దీంతో జగనన్న కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న వ్యకాసం నాయకులు డంపింగ్ యార్డ్ తొలగించిన ప్రదేశాన్ని సందర్శించారు. వారు మాట్లాడుతూ జగనన్న కాలనీ అభివృద్ధి కోసం కాలనీ వాసులు భవిష్యత్తులో మరింత సంఘటితంగా కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. పరిశీలిం చిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, జిల్లా ఉపాధ్యక్షులు ఆంజనేయులు, జిల్లా కమిటీ సభ్యులు స్వర్ణలత, కాలనీ వాసులు ఉన్నారు.


డంపింగ్ యార్డ్‌ను పరిశీలిస్తున్న కార్మిక సంఘం నాయకులు


ఎమ్మెల్యే కందికుంటను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

ఎమ్మెల్యే కందికుంటకు సన్మానం

ప్రజాశక్తి-కదిరి టౌన్

రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలని నిర్ణయం తీసుకోవడంతో కదిరి భవన నిర్మాణ కార్మికులు ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. అలాగే ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్‌ని కలిసి కృతజ్ఞతలు తెలిపి పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి హయాంలో రాష్ట్రంలో సహజ వనరులను అడ్డగోలుగా దోచేసి సొమ్ము చేసుకున్నారని మండిపడ్డారు. ప్రజలు ఇసుక కోసం నానా తిప్పలు పడ్డారని, భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోయారన్నారు. ప్రజలు, కార్మికుల ఇబ్బందులు గుర్తించిన సిఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉచితంగా ఇసుక ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారన్నారు. ఇది ప్రజల ప్రభుత్వమని ప్రజా సంక్షేమం కోసం పని చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే బాలయ్య సతీమణి రాక

చిలమత్తూరు : హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధరదేవి సోమవారం మండలంలో పర్యటిస్తారని టిడిపి మండల కన్వీనర్ రంగారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆమె టేకులోడు గురుకుల పాఠశాలలో 50 ప్యాన్లు, చిలమత్తూరు జూనియర్ కళాశాలలో 9 అధునాతనమైన కంప్యూటర్లు, 1 ప్రింటర్, చిలమత్తూరు జడ్పీ హైస్కూల్‌లో 5 కంప్యూటర్లు, కలర్ ప్రింటర్‌ను పంపిణీ చేస్తారని ఆయన తెలిపారు.

జూదరులు అరెస్ట్

తనకల్లు : మండలంలోని అగ్రహారం గ్రామ శివారులో ఆదివారం కోడి పందెం నిర్వహిస్తుండగా ఎస్ఐ గోపి పోలీసు సిబ్బందితో దాడి చేసి ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 1850 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు మడకశిరలో 'ప్రజాదర్బార్'

ప్రజాశక్తి-మడకశిర

పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజాదర్బార్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే ఎంఎస్.రాజు వ్యక్తిగత కార్యదర్శి రవికుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రూరల్ మండలం, నగర పంచాయతీ పరిధిలోని ప్రజల సమస్యల పరిష్కారం కోసం తహశీల్దార్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఎమ్మెల్యే ఎంఎస్.రాజు ఆధ్వర్యం లో ప్రజాదర్బార్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొంటారన్నారు. మండలంతో పాటు నగర పంచాయతీ పరిధిలోని ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేయాలని తెలిపారు.



ప్రజాదర్బార్ వాయిదా

ప్రజాశక్తి-గోరంట్ల

పట్టణంలోని వెలుగు కార్యాలయంలో ఈ నెల 21వ తేదీ (సోమవారం) రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ సవిత ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'ను అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు టిడిపి మండల కన్వీనర్ సోమశేఖర్ తెలిపారు. ప్రజాదర్బార్ నిర్వహించే తదుపరి తేదీని త్వరలో ప్రకటిస్తామని ఆయన తెలిపారు.

మాజీ సర్పంచి గుండెపోటుతో మృతి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మండలంలోని పైపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచి మాధవప్ప(70) ఆదివారం గుండెపోటుతో మృతిచెందాడు. ఉదయం పొలానికి వెళ్లిన ఆయన అక్కడే గుండె గుండెపోటుకు గురై కుప్పకూలి పడిపోయాడు. స్థానికులు హుటాహుటిన పుట్టపర్తి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మాధవప్ప కాంగ్రెస్‌లో ఆ తర్వాత వైసిపిలో చురుకైన నాయకుడిగా ఎదిగారు. గతంలో కురుబ కార్పొరేషన్ డైరెక్టర్‌గా, సర్పంచిగా పనిచేశారు. ఈయన మృతి పట్ల కాంగ్రెస్, వైసిపి నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విషయం తెలిసిన వెంటనే ఎంపిపి ఎవి.రమణారెడ్డి, దుద్దుకుంట వెంకటరామిరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ నరసారెడ్డి, జడ్పిటిసి లక్ష్మీనరసమ్మ, నాయకులు గంగాధర్, చిత్తరంజన్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, జగరాజుపల్లి సర్పంచి మల్లిరెడ్డి, రాచువారిపల్లి సర్పంచి వెంకటప్ప, పైపల్లి సర్పంచ్ ప్రవీణ్, శ్రీరామ్‌నాయక్, ము రారి, మురళి పైపల్లి వెళ్లి మాధవప్ప మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.


మాధవప్ప(ఫైల్‌ఫొటో)

అనారోగ్యంతో అంగన్వాడీ కార్యకర్త మృతి

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని చెరుకూరు గ్రామంలోని ఒకటో అంగన్వాడీ కేంద్రం కార్యకర్త నాగమ్మ(53) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందా రు. ఆమె 1991లో అంగన్వాడీ కార్యకర్తగా విధుల్లో చేరి దాదాపు 33 ఏళ్లు సేవలందించారు. విషయం తెలుసుకొన్న ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అనురాధ ఆమె మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.


నాగమ్మ(ఫైల్‌ఫొటో)

తాగునీటి ట్యాంక్ శుభ్రం

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండలంలోని మంచేపల్లి గ్రామంలో ఉన్న తాగునీటి ట్యాంకు చుట్టూ చెట్ల పొదలు ఏపుగా పెరగడంతో పాటు నిత్యం నీరు వృథా అవుతుండేది. దీంతో ఆదివారం స్థానిక టిడిపి, జనసేనపార్టీల యువ నాయకులు రహంతుల్లా, గంగాధర్‌తో పాటు పలువురు నీటి ట్యాంకు చుట్టూ ఉన్న చెట్లను తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో నితిన్ తదితర యువకులు పాల్గొన్నారు.

ప్రాచీన సంప్రదాయాలను కాపాడుకుందాం : పల్లె

ప్రజాశక్తి-కొత్తచెరువు

గ్రామీణ ప్రాంతాల్లో ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిఒక్కరూ కాపాడుకోవాలని మాజీమంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి సూచించారు. వాల్మీకి జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక ధర్మవరం రోడ్డులో వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో ఎడ్లబండ్ల పరుగు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పల్లె ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఊపి ఎడ్లబండ్ల పోటీలను ప్రారంభించారు. పల్లె మాట్లాడుతూ గ్రామాల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాల న్నారు. అనంతరం ఎడ్లబండ్ల పోటీల విజేతలకు బహుమతులు, పాల్గొన్న ప్రతిబండి యజమానికి ప్రోత్సాహక బహుమతి అందజేశారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, వాల్మీకి సంఘం నాయకులు డిపో భాస్కర, బండ్లపల్లి రాజు, శివ, హరి, ఉపేంద్ర, శంకర, తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పల్లె

తెలుగు రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణ అమలుచేయాలి

ప్రజాశక్తి-మడకశిర

రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని ఆల్ ఇండియా బీఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలో ఆదివారం డిహెచ్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంఆర్. హనుమంతు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆల్ ఇండియా బహుజన సమాజ్ పార్టీ తుమ కూరు జిల్లా అధ్యక్షుడు బి.భరత్‌కుమార్, ఉపాధ్యక్షుడు కుమార్ మాట్లాడారు. ఎపి, తెలంగాణలో తక్షణం ఎస్సీ వర్గీకరణ అమలు చేసేందుకు ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి కృషి చేయాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పు వెల్లడించిన వెంటనే రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు మా రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని ప్రగల్భాలు పలికారే కానీ నేటికీ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. 30 ఏళ్ల మాదిగల పోరాటాలు వృథా కాకూడదంటే వెంటనే తెలుగు రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణను అమలుచేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు టి.అంజనప్ప, అంజి, రామంజి, చందు, మఠం లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న డిహెచ్‌పిఎస్, బిఎస్పి నాయకులు

నారాయణ పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మీపతికి అవార్డు

ప్రజాశక్తి-గోరంట్ల

పట్టణంలోని నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మీపతి డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం నేషనల్ ప్రతిభ అవార్డును ఆదివారం అందుకున్నారు. విద్యారంగంలో చేసిన సేవలను గుర్తించి సదరన్ ప్రయివేటు లెక్చరర్స్ టీచర్స్ అసోసియేషన్ వారు గుంటూరులో నిర్వహించిన సభలో అవార్డు అందజేశారని అవార్డు గ్రహీత లక్ష్మీపతి తెలిపారు. ఆయన ఈ అవార్డును ఎస్‌పిఎల్‌టిఒ రాష్ట్ర గౌరవాధ్యక్షులు నాగయ్య, ఎమ్మెల్సీ లక్ష్మణరావు నుంచి అందుకున్నారు. లక్ష్మీపతికి అవార్డు రావడం పట్ల నారాయణ పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, శ్రేయోభిలాషులు అభినందనలు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న లక్ష్మీపతి


చలపతి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

పత్తి చలపతికి ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి పత్తి చంద్రశేఖర్ తండ్రి పత్తి చలపతి ఇటీవల మృతిచెందారు. ఆయన వర్ధంతి సందర్భంగా ఆదివారం ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి వారి ఇంటికి వెళ్లి చలపతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే అనంతపురంలో నివాసం ఉన్న పత్తి చంద్రశేఖర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. పత్తి చలపతి సుదీర్ఘ కాలంగా రాజకీయాల్లో కొనసాగారని, ఆ తర్వాత జనసేన పార్టీలో అత్యంత చురుగ్గా నియోజకవర్గ ప్రజల కోసం పని చేశారని కొనియాడారు.

'పల్లె పండుగ'తో గ్రామాలకు మహర్దశ

ప్రజాశక్తి-ముదిగుబ్బ

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన 'పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాలు' కార్యక్రమంతో గ్రామాలకు మహర్దశ పట్టిందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, ఎంపి బికె.పార్థసారథి తెలిపారు. స్థానిక టీచర్స్ కాలనీలో ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమంలో మంత్రి, ఎంపితో పాటు ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, జనసేనపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, సందిరెడ్డి శ్రీనివాస్ పాల్గొని సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే ప్రజా సమస్యలపై అర్జీలు స్వీకరించి వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వారు మాట్లాడుతూ సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. అనంతరం మంత్రి బిజెపి కార్యాలయాన్ని ప్రారంభించగా ఎంపిపి సమక్షంలో పలువురు బిజెపిలో చేరారు.

కదిరి టౌన్ : వైసిపి ప్రభుత్వంలో పాలకుల నిర్లక్ష్యం కారణంగా పంచాయతీ వ్యవస్థను నిర్వీరం చేశారని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ విమర్శించారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఆదివారం కదిరి రూరల్ మండలంలోని పట్నం పంచాయతీలో రూ. 29.8 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపిస్తుందన్నారు. జగన్ హయాంలో కేంద్రం ప్రభుత్వం పంచాయతీలకు కేటాయించిన నిధులను పక్కదారి పట్టించి గ్రామాలను పూర్తిగా నిర్వీర్యం చేశారని విమర్శించారు. కార్యక్రంలో ఎంపిడిఒ పోలప్ప, టిడిపి మండల కన్వీనర్ చెన్నకేశవలు, సర్పంచి చలపతినాయక్, నాయకులు పాల్గొన్నారు.

తలుపుల : మండలంలోని ఓబులరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గరికపల్లి గ్రామంలో బి.రామిరెడ్డి పొలం నుంచి గంజివారిపల్లి రోడ్డు వరకూ రూ. 15 లక్షలతో అప్రోచ్ సిమెంట్ రోడ్డుకు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

మడకశిర : రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల్లో అభివృద్ధే 'పల్లె పండుగ' లక్ష్యమని టిడిపి నాయకులు తెలిపారు. రొళ్ల మండలంలోని బంద్రేపల్లి, చెర్లోపల్లి గ్రామాల్లో ఆదివారం సీసీ రోడ్లకు భూమిపూజ చేశారు. నాయకులు మాట్లాడుతూ సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నారన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ దాసిరెడ్డి, టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి గురుమూర్తి, నియోజకవర్గ కోఆర్డినేట్ రామకృష్ణ, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు బాలకృష్ణ, ఉపాధ్యక్షుడు నాగేంద్ర, నాయకులు భరత్, వెంకటేష్, ఉగ్రేగౌడ్, సిద్ధగంగప్ప, ముడుపేగౌడ్, రామచంద్ర, నారాయణప్ప, కార్యకర్తలు పాల్గొన్నారు.

సోమందేపల్లి : మండలంలోని బ్రహ్మసముద్రం పంచాయతీలో పంచాయతీ కార్యదర్శి శివశంకర్‌నాయక్, ఉపాధి హామీ ఎపిఒ సోమశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. రూ. 20 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణానికి అధికారులు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో డీలర్ శేషప్ప, జనసేన పార్టీ పెనుకొండ మండల కన్వీనర్ మహేష్, అంజి, హనుమంతప్ప, హరీష్, శ్రీరాములు, గంగాధర్, ముద్దన్న పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి, ఎంపిని సన్మానిస్తున్న నాయకులు

గాండ్లపెంట : మండలంలోని కురుమామిడి, గాజులవారిపల్లిపెద్దతండా, తదితర గ్రామాల్లో పల్లెపండుగ కార్యక్రమం నిర్వహించినట్లు ఎపిఒ మంజునాథ్, ఈసీ సుబ్బారెడ్డి తెలిపారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 3 కోట్లు నిధులతో అవసరమైన చోట్ల గ్రామాల్లో సీసీ రోడ్లు ఏర్పాటు చేస్తామన్నారు. కురుమామిడిలో రూ. 20 లక్షలతో, గాజులవారిపల్లి పెద్దతండాలో రూ. 5 లక్షలతో సీసీ చేపట్టిన రోడ్లకు భూమి పూజ చేశారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి సుధాకర్, టెక్నికల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

హిందూపురం : పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఆదివారం హిందూపురం రూరల్ మండలంలో రెండు గ్రామాల్లో రూ. 1.10కోట్ల అభివృద్ధి పనులను ఎంపిడిఒ సరస్వతి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచామితీ కార్యదర్శి కెంచరాయప్ప, గ్రామ స్థాయి నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


హిందూపురంలో అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎంపిడిఒ సరస్వతి


మడకశిరలో అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న అధికారులు

భవన సముదాయాలు సమకూర్చుకోవాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీనివాస్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురంలో న్యాయస్థానాల నిర్వహణకు త్వరితగతిన భవన సముదాయాలను సమకూర్చుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీనివాస్ స్థానిక న్యాయమూర్తులకు సూచించారు. ప్రస్తుతం హిందూపురం న్యాయ సముదాయంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి, ప్రత్యేక న్యాయస్థానం భవన సముదాయాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో తాత్కాలికంగా ఇతర ప్రభుత్వ భవన సముదాయాల్లో ఆయా న్యాయస్థానాల నిర్వహణకు అందుబాటులో ఉన్న భవనాలను ఆదివారం జిల్లా జడ్జి జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. తొలుత జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీనివాస్, జాయింట్ కలెక్టర్, అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ, సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి లలితా లక్ష్మి, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ సుకుమార్ స్థానిక సబ్ కోర్ట్ ఆవరణలో న్యాయవాదులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రస్తుతం కోర్టుల నిర్వహణకు అందుబాటులో ఉన్న భవన సముదాయాలపై న్యాయవాదులతో చర్చించారు. స్థానిక పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పశు వైద్యశాలకు అనుగుణంగా ఉన్న భవన సముదాయం తాత్కాలికంగా కోర్టుల నిర్వహణకు అనువుగా ఉంటుందని న్యాయవాదులు న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు జిల్లా న్యాయమూర్తి స్పందిస్తూ ఆ భవన సముదాయానికి తోడు ప్రయివేటు భవన సముదాయాలు ఉన్నా అద్దె చెల్లించి న్యాయస్థానాలు నిర్వహించేందుకు అందుబాటులో ఉంటే వాటిని కూడా పరిశీలిద్దామనితెలిపారు. అయితే ప్రస్తుతం నిర్వహిస్తున్న అదనపు జిల్లా కోర్టు, సబ్ కోర్టులకు సమీపంలోనే పశు వైద్యశాలకు సంబంధించిన భవన సముదాయం ఎంతో అనువుగా ఉంటుందని చెప్పడంతో ఆ భవన సముదాయాన్ని జిల్లా జడ్జి, జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. దీనికి తోడు ప్రస్తుతం న్యాయస్థానాల నిర్వహణకు ఇబ్బందిగా ఉన్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి భవన సముదాయాలను జిల్లా న్యాయమూర్తి పరిశీలించారు. అదే విధంగా ఇప్పటికే కోర్టుల నిర్వహించుటకు స్వాధీనం చేసిన పాత రెవెన్యూ కార్యాలయాన్ని కూడా జేసీతో కలిసి జిల్లా న్యాయమూర్తి పరిశీలించారు. దీనికి తోడు దానికి ఎదురుగా ఉన్న రైతు శిక్షణా కేంద్రం భవన సముదాయాన్ని కూడా పరిశీలించారు. అనంతరం న్యాయవాదులతో జరిగిన సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజశేఖర్, కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం నిర్వహిస్తున్న కోర్టు సముదాయానికి సమీపంలోనే పశువైద్యశాలలో ఉన్న భవన సముదాయం ఆయా న్యాయస్థానాలను తాత్కాలికంగా నిర్వహించేందుకు అటు న్యాయవాదులకు ఇటు కక్షిదారులకు ఎంతో అనువుగా ఉంటుందని తెలిపారు. అదే విధంగా ఇతర కోర్టుల్లో పని ఉన్న సమయంలో కూడా సమీపంలోనే ఉండడంతో ఆయా కోర్టులో కూడా విధులు నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని జిల్లా న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై జిల్లా న్యాయమూర్తి స్పందిస్తూ అందుకు సంబంధించి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిపాదనలు సిద్ధం చేసి త్వరితగతిన తీసుకువస్తే రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లి



కోర్టు భవన సముదాయాన్ని పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీనివాస్

అందుకే అనుగుణంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈసందర్భంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా న్యాయమూర్తి, జాయింట్ కలెక్టర్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎపిపి ఇందాద్, సీనియర్ న్యాయవాదులు రామచంద్రారెడ్డి, రంగారెడ్డి, సుదర్శన్, సిద్దు, నాగరాజు రెడ్డి, సదాశివరెడ్డి, ప్రసాద్ రెడ్డి, రవిచంద్ర, మురళీ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు భవన సముదాయం పరిశీలన

స్థానిక న్యాయస్థాన సముదాయానికి ఎదురుగా ఉన్న పోలీసు భవన సముదాయాన్ని జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌తో పాటు స్థానిక న్యాయమూర్తులు కంపల్లె శైలజ, శ్రీధర్, రాజ్యలక్ష్మి, లలితా లక్ష్మి పరిశీలించారు. గతంలో ఆ స్థలాన్ని పోలీసు శాఖతోపాటు బార్ అసోసియేషన్ కూడా కేటాయించేందుకు రెవెన్యూ అధికారులు అంగీకరించారని, అయితే గతంలో ఇక్కడ పనిచేసిన ఓ సిఐ రాత్రికి రాత్రే ఆ స్థలంలో ప్రహరీ నిర్మించారని డిజె దృష్టికి తీసుకెళ్లగా ఆ స్థలాన్ని పరిశీలించారు. ప్రస్తుతం ఆ భవన సముదాయంలో ఎలాంటి పోలీసు కార్యకలాపాలు లేకపోవడానికి గమనించి ఈ భవన సముదాయం ప్రస్తుతం ఉపయోగించడం లేదని, తాము తీసుకుంటే అభ్యంతరం లేదు కదా అంటూ డీఎస్పీ మహేష్‌ను జిల్లా న్యాయమూర్తి అడిగారు. తమకు ఎలాంటి అభ్యంతరం లేదని చెప్పడంతో విషయాన్ని జిల్లా ఎస్పీతో చర్చించి ఆ భవన సముదాయాన్ని కోర్టు నిర్వహణలోకి కలుపుకుంటామని జిల్లా న్యాయమూర్తి తెలిపారు.

ఉపకారాగారం తనిఖీ

న్యాయస్థానాల నిర్వహణకు తాత్కాలిక భవన సముదాయాలను పరిశీలించేందుకు ఆదివారం ఇక్కడికి విచ్చేసిన జిల్లా న్యాయమూర్తి జి.శ్రీనివాస్ స్థానిక ఉపకారాగారాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రస్తుతం ఉపకారాగారంలో ఉన్న ఖైదీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో హరినాథ్ అనే గార్డ్ నిర్లక్ష్యంగా ఉండడం పట్ల జిల్లా న్యాయమూర్తి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపకారాగార అధికారి అంజి నాయక్ ఉదాసీనతపై కూడా న్యాయమూర్తి విస్మయం వ్యక్తం చేశారు.

నేడు రీసర్వే సమస్యలపై గ్రామసభ

ప్రజాశక్తి-చిలమత్తూరు

మండలంలోని సుబ్బరావుపేట గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం వద్ద సోమవారం రీ సర్వేపై గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ యూనస్‌బాబు తెలిపారు. రైతులు భూ సంబంధిత సమస్యలను తెలిపి పరిష్కరించుకోవాలని తహశీల్దార్ సూచించారు.


మూర్ఛవ్యాధి వైద్య శిబిరం

ప్రజాశక్తి-హిందూపురం

మూర్ఛ వ్యాధిగ్రస్తులను ఆదుకోవాలని ఉద్దేశంతో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని నియోజకవర్గ ఎన్జీవో సంఘ అధ్యక్షులు నరసింహులు పేర్కొన్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అల్ హిలాల్ పాఠశాల ఆవరణలో ఆదివారం ఏర్పాటుచేసిన ఉచిత మూర్ఛ వ్యాధి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మూర్ఛ వ్యాధి బాధితులను ఆదుకునేందుకు జన విజ్ఞాన వేదిక చేస్తున్న ప్రయత్నం వెలకట్టలేనిదని అన్నారు. అందుకోసం తన వంతుగా రూ.10,116 ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జెవివి కార్యదర్శి డాక్టర్ ఇటి. రామ్మూర్తి, జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు రామకృష్ణ, శ్రీనివాసులు, నాగేంద్ర చారి, లక్ష్మీపతి, మురళీమోహన్, మల్లికార్జున, చంద్రశేఖర్ రెడ్డి, మంజునాథ చారి, విశ్వనాథ చారి, సుబ్రహ్మణ్య నాయక్, అతావుల్లా తదితరులు పాల్గొన్నారు.



మూర్ఛ రోగులకు చికిత్స చేస్తున్న డాక్టర్ ఇటిగి రామ్మూర్తి



నూతనంగా ఎంపికైన ప్రయివేటు పాఠశాలల జిల్లా కార్యవర్గం

ప్రయివేటు పాఠశాలల సంఘం జిల్లా అధ్యక్షులుగా రియాజ్

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీ సత్య సాయి జిల్లా ప్రయివేటు పాఠశాలల అధ్యక్షులుగా రియాజ్ ఎన్నికయ్యారు. ఆదివారం పెనుకొండ పట్టణంలో జిల్లా నూతన కార్యవర్గానికి ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల పరిశీలకులుగా పుల్లా రెడ్డి హాజరు కాగా, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి ఎస్ శ్రీనివాసులు, అనంతపురం జిల్లా అధ్యక్షులు సుబ్బారెడ్డి, రాష్ట్ర సలహాదారు నాగపీరయ్య సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఎనుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా హిందూపురం పట్టణానికి చెందిన రీయాజ్‌ను ఎంపిక చేశారు. ఉపాధ్యక్షులుగా పీఎస్ శ్రీనివాసులు, గౌరవ అధ్యక్షులుగా కొత్తచెరువు ప్రభాకర్, కార్యదర్శిగా గౌస్, కోశాధికారి గా శ్రీకాంత్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులుగా వినూషతో పాటు కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రయివేటు పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-కొత్తచెరువు

మండలంలోని గోరంట్లపల్లి గ్రామానికి చెందిన కురుబ రవి ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలిసినే వెంటనే కురువ సంఘం జిల్లా నాయకులు, టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ వారి ఇంటికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి పార్టీ తరపున అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట కురువ సంఘం ఉపాధ్యక్షులు ఆదినారాయణ, నాయకులు, కార్యకర్తలు, ఉన్నారు.



ఆదమరిస్తే అంతే..

కల్వర్టు పక్కనే ప్రమాదకరంగా గుంతలు..

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని పెనుకొండ–పావగడ ప్రధాన రహదారిలో నుంచి ఆర్.మరవపల్లి నుంచి హిందూపురం వెళ్లే దారిలో దొడగట్ట వరకూ డబుల్ లైన్ రోడ్డు పనులు చేపట్టారు. ఇందులో భాగంగా కల్వర్టులు కుడా వెడల్పు చేపట్టే కార్యక్రమం చేపట్టారు. ఈ క్రమంలో పెనుకొండ–పావగడ ప్రధాన రహదారికి వంద మీటర్ల దూరంలో కల్వర్ట్ పక్కనే దాదాపు పది అడుగులు లోతైన గుంతలు తీసి పనులు చేపట్టారు. ఆ తర్వాత ఆ గుంతలను పూడ్చకుండా అలానే వదిలేశారు. దీంతో ఆ మార్గంలో ప్రయాణం చేసే వాహనదారులు ఏమాత్రం ఏమరుపాటుగా వెళ్లినా ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. ప్రధానంగా రాత్రివేళ గుంతలు కనిపించ అందులో పడిపోయే ప్రమాదం ఉంది. దీనికి తోడు కల్వర్టుపై మట్టి సరిగ్గా వేయకపోవడంతో వాహనాలకు కింద బాగంలో రోడ్డు తగులుతుందని వాహనదారులు వాపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి గుంతలు పూడ్చి ప్రమాదాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చిన్నకోడిపల్లిలో పడకేసిన పారిశుధ్యం

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని చిన్నకోడిపల్లి గ్రామంలో పారిశుధ్యం పడకేసినా పంచాయతీ సిబ్బంది కానీ, అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. దీంతో గ్రామంలోని వీధుల్లో మురుగునీరు, డ్రెయినీజీ కాలువల్లో ముళ్లపొదలు, జమ్ము గడ్డి పెరిగి నీరు ముందుకు కదలని పరిస్థితి ఏర్పడింది. దీంతో దుర్వాసన వెదజల్లడంతో పాఉ రాత్రివేళ ఇళ్లలోకి విష పురుగులు చేరుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. అలాగే తాగునీటి ట్యాంకు చుట్టూ అపరిశుభ్రత నెలకొనడంతో దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి ట్యాంకులు, డ్రెయినేజీ కాలువలను ఏడాదిగా శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వెదజల్లుతుందని, గ్రామంలో మూడు నాలుగు చోట్ల పైపులైన్ పగిలి నీరు కలుషితమవుతున్నాయని వాపోయారు. ఆయా విషయాలు నెల రోజుల క్రితమే అధికారులకు తెలిపినా ఫలితం లేదని మండిపడుతున్నారు. ఇకనైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టడంతో పాటు పైపులైన్ మరమ్మతులు, తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మద్యం దుకాణం వద్ద చెత్త కుప్పలు

ప్రజాశక్తి-రొద్దం

స్థానిక ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద మద్యం ఖాళీ సీసాలు, వాటర్ ప్యాకెట్లు కుప్పలు కుప్పలుగా దర్శనమిస్తున్నాయి. మందు బాబులు ఈ దుకాణం వద్దే మద్యం తాగి ఖాళీ సీసాలు, వాటర్ ప్యాకెటలను అక్కడే పడేస్తున్నారు. దాదాపు రెండేళ్లుగా వేస్తుండడంతో పెద్దకుప్పను తలపిస్తున్నాయి. వాటి నుంచి దుర్వాసన వెదజల్లుతుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా పంచాయతీ అధికారులు స్పందించి వాటిని తొలగించేందుకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణంలో అసాంఘిక కార్యకలాపాలు

ప్రజాశక్తి-రొద్దం

మండలంలో ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఆర్.మరవపల్లిలో తహశీల్దార్, ఎంపిడిఒ, వెలుగు, హౌసింగ్, వ్యవసాయ శాఖ కార్యాలయాలు ఒకే ప్రాంగణంలో నిర్వహిస్తున్నారు. ఈ కార్యాలయ ఆవర ణలో ఎటు చూసినా మద్యం, వాటర్ ప్యాకెట్లు, ఖాళీ బీరు బాటిళ్లే దర్శనమిస్తున్నాయి. కార్యాలయ ప్రాంగణంలో ప్రజల కోసం ఏర్పాటుచేసిన సిమెంటు బెంచిలపై కొందరు వ్యక్తులు రాత్రివేళ మద్యం తాగి వాటి వ్యర్థాలను అక్కడే పడేస్తున్నారు. దీనికి తోడు కార్యాలయ ప్రాంగణం చుట్టూ బహిర్భూమికి వెళ్తుండడంతో దుర్వాసన వెదజల్లుతోందని ప్రజలు వాపోతున్నారు. వర్షాకాలం అయితే పరిశుభ్రతా చర్యలు చేపట్టకపోవడంతో దోమల బెడద ఎక్కువైందని పేర్కొంటున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.



రొద్దంలో ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలో వేసిన వాటర్ ప్యాకెట్లు